# దమ్ముంటే కేంద్రం నిధుల జీవోలతో చర్చకు రా..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

- బండి సంజయ్‌కి నగర మేయర్ సునీల్‌రావు సవాల్
- నగర అభివృద్ధికి కేంద్రం ద్వారా నయా పైసా రాలేదని స్పష్టీకరణ

కార్పొరేషన్, నవంబర్ 14: నగరాభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తెచ్చానని ఎన్నికల ప్రచారంలో అసత్యం చెబుతున్న బండి సంజయ్, దమ్ముంటే సదరు నిధులకు సంబంధించిన జీవోలు, ఆధారాలతో చర్చకు రావాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు సవాల్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకువచ్చిన నిధుల జీవోలతో తాము నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. బహిరంగ చర్చకు రమ్మంటే రాకుండా తప్పించుకు తిరుగుతూ ప్రజలను సంజయ్ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం నుంచి నగరాభివృద్ధికి నిధులు తీసుకువచ్చామని సంజయ్ మాటిమాటికీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నగర ప్రజలకు అన్ని విషయాలు తెలుసని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో సంజయ్ మరోసారి ఓడిపోవడం ఖాయమన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు. నగరంలో సాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో కేంద్రం నిధులు నయాపైసా కూడా లేదని తేల్చిచెప్పారు. నగరాభివృద్ధికి సీఎం హామీ కింద రూ.500 కోట్లుతెచ్చి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేశామన్నారు. వీటిలోనూ కేంద్రానికి సంబంధించి నయా పైసా లేదన్నారు. అలాగే రూ. 230 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తే దానిలో కేంద్ర వాటా సున్న అని పేర్కొన్నారు. రూ.800 కోట్లతో చేపడుతున్న మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకూ కేంద్ర ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎలక్ట్రిసిటీ సమస్యలు తీర్చేందుకు కేటాయించిన రూ.130 కోట్లలో కేంద్రం వాటా ఎంత అని ప్రశ్నించారు. ఐటీ టవర్ నిర్మాణంలో మీ పాత్ర ఏమైనా ఉందా? అని నిలదీశారు. రూ.150 కోట్ల జనరల్ ఫండ్‌తో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కేంద్రం నుంచి ఏమైనా సహకారం ఉందా? అని ప్రశ్నించారు. మంత్రి గంగుల భూకబ్జాలు చేశారన్న ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయా? అని నిలదీశారు. మచ్చలేని నాయకుడు గంగులపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాల కోరు బండి సంజయ్

- ఆరోపణల్లో ఒక్కటైనా నిరూపించాలి
- లేకపోతే బీజేపీ ప్రచారంలో నిలదీస్తాం
- నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్



విలేకరుల సమావేశంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, నవంబర్ 14: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జీవితమే అబద్ధాలతో నిండిందని, ఎప్పుడూ ప్రజలను రెచ్చగొట్టేందుకు ఆయన అసత్య ప్రచారాలు చేస్తూనే ఉంటారని నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ విమర్శించారు. కరీంనగర్‌లో యువత మత్తు మందులకు బానిసయ్యారని, మంత్రి గంగుల భూ కబ్జాలకు పాల్పడ్డారంటూ సోయి లేకుండా బండి సంజయ్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బండి సంజయ్ చేసిన ఆరోపణల్లో ఒక్కటైనా నిరూపించాలని సవాల్ చేశారు. లేకపోతే సంజయ్ ప్రచారం చేసే ప్రాంతాల్లోనే బీఆర్ఎస్ యువత నిలదీస్తుందని తెలిపారు. మంగళవారం స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో సంజయ్‌కి డిపాజిట్ కూడా రాదన్నారు. ఎంపీగా గెలిపించినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా నిధులు తేలేని అసమర్థ ఎంపీ బండి సంజయ్ అని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో చేరిన యువతకు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న గొప్ప నేత గంగుల కమలాకర్ అని కొనియాడారు. ఇకనైనా మూర్ఖత్వపు మాటలు మానుకోవాని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, డి.శ్రీధర్, చేతి చంద్రశేఖర్, వంగ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్‌కు కొత్త రూపు

- రూ. 6.50 కోట్లతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ పరిధజలోని దుద్దనపల్లిలోని గోదాంలో వేసిన సీసీ రోడ్డు

హుజూరాబాద్, నవంబర్ 14: స్వరాష్ట్రంలో హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మార్కెట్ పరిధిలోని ఉప మార్కెట్లలోనూ అభివృద్ధి పనులు ముమ్మరంగా జరిగాయి. హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ 1985లో ఏర్పాటుకు కాగా, తర్వాత పెద్దగా అభివృద్ధి జరుగలేదు. గత ఆరేండ్ల నుంచి వ్యవసాయ మార్కెట్ పరిధిలో రూ. 6.50కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. 2018లో హుజూరాబాద్‌లో రూ. 1.26కోట్లతో రైతు బజారు నిర్మించారు. అదే ఏడాది రూ. 40లక్షలతో ప్రహరీ, రైతుల సౌకర్యం కోసం మరుగుదొడ్లు, ఇతరాత్ర నిర్మాణ పనులు చేపట్టారు. 2021లో రూ. 2లక్షల 55వేలతో హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ ప్రహరీ నిర్మాణం, ఇతర మరమ్మతులు చేపట్టారు. అదే ఏడాది హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్, కేశవపట్నం ఉపమార్కెట్‌లో రూ. 11లక్షలతో రైతు ఎడ్ల బండిపై ధాన్యం తరలిస్తున్నట్లు ఉండే విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ యేడు రూ. 91లక్షల నాబార్డు నిధులతో సైదాపూర్ మండలం దుద్దనపల్లిలోని గోదాంలో సీసీ రోడ్డు వేశారు. రూ. 60లక్షల నాబార్డు నిధులతో భీమదేవరపల్లిలోని గోదాంలో సీసీ రోడ్డు వేశారు. రూ. కోటీ 22లక్షల నాబార్డు నిధులతో ఎల్కతుర్తిలోని గోదాంలో సీసీ రోడ్డు నిర్మించారు. సౌకర్యాలు మెరుగుపడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతిపైసా సద్వినియోగం



హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు పన్నుల రూపంలో వచ్చిన ప్రతి పైసా సద్వినియోగం చేశాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్కెట్ పరిధిలో కొత్తగా 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నాలుగు గోదాములు నిర్మించాం. గతంలో కేవలం హుజూరాబాద్ మార్కెట్‌లోనే ఒక్క గోదాము మాత్రమే ఉండేది. ముఖ్యంగా మార్కెట్‌కు వచ్చే రైతుల సౌకర్యం కోసం మరుగుదొడ్లు నిర్మించాం.

*- బర్మావత్ రమా నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్*

### అభివృద్ధి స్పష్టంగా కనబడుతున్నది



బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేసిన అభివృద్ధి పనులు స్పష్టంగా కనబడుతున్నయ్. గతంలో మరుగుదొడ్లు లేక రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ ముందు పెట్టిన ఎడ్లబండితో రైతు విగ్రహం చాలా బాగుంది. కాంపౌండ్ నిర్మాణంతో దినుసుకు రక్షణ ఏర్పడింది. రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సహకారం బాగుంది.

*- సుంకరి రాజమొగిలి, రైతు (రంగాపూర్)*



గాంధీయాదవ్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

# సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్
- బీజేపీ నుంచి 500 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిక

సైదాపూర్, నవంబర్ 14: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పెర్కపల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ముత్యాల గాంధీయాదవ్ సుమారు 500మంది కార్యకర్తలతో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముత్యాల గాంధీయాదవ్ పార్టీలో చేరడం చాలా సంతోషకరమన్నారు. పార్టీ విధానాలు, ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల వారు భారీగా చేరుతున్నారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రతి కార్యకర్త ఎన్నికలను సీరియస్‌గా తీసుకుని పార్టీకోసం పనిచేయాలన్నారు.

**సర్వాయిపేట ఉప సర్పంచ్ చేరిక**

మండలంలోని సర్వాయిపేట గ్రామ ఉప సర్పంచ్, బీజేపీ నాయకురాలు పెసరు రమ్య శృతి- అశోక్‌చక్రవర్తితో పాటు పలువురు యువకులు మండలంలోని శివరాంపల్లిలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు, ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, సింగిల్‌విండో చైర్మన్లు కొత్త తిరుపతి రెడ్డి, బిల్ల వెంకటరెడ్డి, సర్పంచులు అబ్బిడి పద్మా రవీందర్‌రెడ్డి, బత్తుల కొమురయ్య, ఏనుగుల ఐలయ్య, గౌడసంఘం జిల్లా నాయకులు అనగోని వీరన్నగౌడ్, ముదిరాజ్‌మహాసభ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పోలు ప్రవీణ్‌కుమార్, నాయకులు ముత్యాల వీరారెడ్డి, ముద్దమల్ల సుధాకర్, మాదం స్వామియాదవ్, పిల్లి కొమురయ్య, పోతరాజు శ్రీనివాస్, కానుగంటి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన ఆంధ్రా బీఆర్ఎస్ నాయకులు



చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏపీ బీఆర్ఎస్ నాయకులు

గంగాధర, నవంబర్ 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను బూరుగుపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మూడో సారి అధికారం చేపట్టబోతున్నదని వారు తెలిపారు. చొప్పదండిలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రెండో సారి ఎమ్మెల్యేగా గెలుస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రవిశంకర్‌ను శాలువాలతో సన్మానించి, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ నాయకులు ఉజ్జినేని వంశీకృష్ణ, జెట్టి రామారావు, సింగంపల్లి జగదీశ్, తలారి సురేశ్, తోటకూర కోటేశ్వర్‌రావు, రామ్మోహన్‌నాయుడు తదితరులు ఉన్నారు.

# సీఎం పర్యటనకు పటిష్ట భద్రత



సభా స్థలానికి సీఎం వెళ్లే రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

- సీపీ అభిషేక్ మహంతి
- మధురానగర్‌లో సీఎం సభా స్థలం పరిశీలన

గంగాధర, నవంబర్ 14: నెల 17న చొప్పదండి నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి తెలిపారు. మండలంలోని మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో హెలీప్యాడ్, సభా స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. రూట్ మ్యాప్, సీఎం కేసీఆర్ హెలీప్యాడ్ నుంచి సభా స్థలానికి వెళ్లే రూట్‌ను పరిశీలించి, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో పోలీసు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్థానికుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఇక్కడ రూరల్ ఏసీపీ కరుణాకర్ రావు, సీఐ రవీందర్, ఎస్ఐ పుల్ల అభిలాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.